


**సిఇసి జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలి**


# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శనివారం | 10 అక్టోబరు , 2026 | పేజీలు : 7


# లైన్ క్లియర్...! పటేల్‌కే పార్టీ పగ్గాలు?

### త్వరలో అధికారికంగా ప్రకటించనున్న కాంగ్రెస్ అధిష్టానం!!!



**ప్రజాపక్షం/సూర్యాపేట :** దివంగత నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి మరణంతో గత ఏడాది కాలంగా ఖాళీగా ఉన్న సూర్యాపేట నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పదవికి లైన్ క్లియర్ అయ్యింది. ఈ పదవికి తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిల మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో అధిష్టానం ఎటు తెల్చుకోలేక ఇన్ని రోజులు దీనిని భర్తీ చేయని విషయం అందరికి తెలిసిందే. దీనితో సూర్యాపేట నియోజక వర్గానికి అధికారికంగా పార్టీ పెద్దదిక్కు ఎవరన్నది కూడా పార్టీ ప్రకటించకపోవడంతో పార్టీ శ్రేణుల్లో అయోమయానికి లోనయ్యారు. ఈ ఇరువురు మధ్య పోటీ నెలకొనడంతో ఎవరి వద్దకు వెళ్లాలో తెలియక సతమతమయ్యారు. పార్టీ కార్యక్రమాలు కూడా ఈ ఇరువురు నేతలు వేరువేరుగా నిర్వహించడంతో ప్రజల్లో కూడా అయోమయం నెలకొంది.

దివంగత నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి తనయుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని పార్టీ అధిష్టానం ఇటీవల ఉమ్మడి నల్లగొండఖమ్మంవరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా ప్రకటించడంతో పటేల్‌కు లైన్ క్లియర్ అయ్యిందనే చర్చ పార్టీ వర్గాల్లో జోరుగా సాగుతుంది. సిఎం రేవంత్ రెడ్డి అత్యంత ఆప్తుడుగా, అతనితో కలిసి చదువుకున్న బాల్య స్నేహితుడిగా, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ముందు వరకు వీరు టిడిపిలో కలిసి పని చేశారు. అనంతరం రాష్ట్రంలో జరిగిన రాజకీయ పరిణామాలతో టిడిపి పార్టీని వీడి ఒకే రోజు ఈ ఇరువురు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అనతికాలంలోనే ఆయన ఆ పార్టీ రాష్ట్ర పగ్గాలు చేపట్టడం, 2023లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడంతో సిఎం కావడం చకచకా జరిగిపోయాయి. సూర్యాపేట నియోజక వర్గంలో ఎంఎల్‌ఏగా పోటీ చేసి గెలిచి చక్రం తిప్పాలనుకున్న పటేల్ రమేష్ రెడ్డికి కాలం కలిసి రాలేదు. దీంతో తన బాల్య స్నేహితుడికి సిఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పదవిని అప్పగించి సంతృప్తి పరిచారు.

ఏడాది కాలంగా ఖాళీగా ఉన్న సూర్యాపేట నియోజక వర్గ ఇంచార్జి పదవి పటేల్ రమేష్ రెడ్డికి కట్టబెడుతూ పార్టీ అధిష్టానం త్వరలో అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలిసింది. ఏనోట విన్నా రమేష్ రెడ్డి పేరునే వినిపిస్తుంది. ఈ పదవి రమేష్ రెడ్డికి ఇవ్వడమే న్యాయమని పార్టీ శ్రేణులు కూడా భావిస్తున్నారు. స్థానికుడిగా ఎంతో గుర్తింపు ఉండడం, రాజకీయంగానే కాకుండా మొదటి నుండి తన సోదరుడు ప్రవాస భారతీయుడు పటేల్ శ్రీధర్ రెడ్డి ఏర్పాటు చేసిన స్ప్రెడ్ ఇండియా సేవా సంస్థ ద్వారా గత 30 ఏండ్లకు పైగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. విద్యాభివృద్ధి కోసం ఈ సంస్థ ద్వారా ప్రతి విద్యా సంవత్సరం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తున్నారు. దీంతోపాటు రాజకీయంగా రాణిస్తున్న ఆయన ఏ పార్టీలో ఉన్నా పార్టీ నాయకలకు, కార్యకర్తలకు ఆర్థికంగా అండగా నిలుస్తూ వస్తున్నారు. ఈ నియోజక వర్గంలో ఏ గ్రామానికి వెళ్ళిన ఆయన ఆర్థిక సహాయంతోనే నిర్మించిన బడులు, గుడులు కనబడతాయి. గత 25 సంవత్సరాలుగా రమేష్ రెడ్డి కన్న కలలు త్వరలో నెరవేరబోతుండడంతో ఆయన వర్గీయుల్లో ఆనందం వెల్లువిరుస్తుంది.

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

### రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా ఆయన ఆడపడుచులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం పితృ అమావాస్యతో ప్రారంభమయ్యే బతుకమ్మ ఉత్సవాలతోపాటు ఆదివారం నుంచి ప్రారంభమయ్యే దేవి శరన్నవరాత్రోత్సవాలను ఐక్యతతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే గొప్ప పండుగ బతుకమ్మ అని, తెలంగాణ ఆడబిడ్డల ఆత్మ గౌరవానికి ప్రతీక అన్నారు. తెలంగాణ సంస్కృతిని కాపాడటంలో, బతుకమ్మ వంటి పండుగలకు పెద్దఎత్తున నిధులు కేటాయించి ఘనంగా నిర్వహిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు మరింత ప్రాధాన్యత ఇస్తూ, మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఎంగిలి పువ్వుతో ప్రారంభమయ్యే బతుకమ్మ, దేవి నవరాత్రుల పండుగలను సంతోషంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రజలందరికి ఆయన బతుకమ్మ, దేవి శరన్నవరాత్రోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ : మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** తెలంగాణ సంసృ్కతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడపడుచులందరికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. శనివారం పితృ అమావాస్యతో ప్రారంభమయ్యే బతుకమ్మ ఉత్సవాలతో పాటు ఆదివారం నుంచి ప్రారంభమయ్యే దేవి శరన్నవరాత్రోత్సవాలు ఐక్యతతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఎక్కడా లేనివిధంగా ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే బతుకమ్మ తెలంగాణ ఉద్యమంతో ఖండాంతరాలకు విస్తరించిందని తెలిపారు. ఎంగిలి పువ్వుతో ప్రారంభమయ్యే బతుకమ్మ, దేవీ నవరాత్రుల పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రజలందరికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

## బజ్జీల కొట్టు వద్ద 'విప్' సరదా..

### సామాన్యుడిలా ముచ్చటించిన బీర్ల ఐలయ్య!

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** ప్రజాప్రతినిధిగా నిత్యం ప్రజల్లో ఉండే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మరోసారి తన సరళమైన వ్యవహారశైలితో స్థానికులను ఆకట్టుకున్నారు. బస్వాపూర్ రిజర్వాయర్ భూ నిర్వాసితులైన లప్ప నాయక్ తండా వాసులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి వెళ్తుండగా, యాదగిరిగుట్ట మండలం దాతరుపల్లి గ్రామ సమీపంలో ఆయన ఆసక్తికర సన్నివేశానికి కేంద్రబిందువుగా మారారు. మార్గమధ్యలో ఉన్న ఒక చిన్న హోటల్ వద్ద ఆగిన ఐలయ్య.. నిర్వాహకులతో పాటు అక్కడ ఉన్న స్థానికులను ఆప్యాయంగా పలకరించి ముచ్చటించారు. అనంతరం స్వయంగా కడాయి ముందుకు వెళ్లి వేడివేడిగా మిర్చి బజ్జీలు వేసి అక్కడున్న వారందరినీ ఆశ్చర్యపరిచారు.ఎంతటి ఉన్నత పదవిలో ఉన్నప్పటికీ సామాన్యుడిలా తమ మధ్యకు వచ్చి, ఆత్మీయంగా మాట్లాడి బజ్జీలు వేసిన ఎమ్మెల్యే తీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.





## చెన్నై షాపింగ్ మాల్‌లో సినీతార రితికా నాయక్ సందడి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ వేడుక అట్టహాసంగా జరిగింది.ప్రముఖ సినీ తార రితికా నాయక్ ముఖ్య అతిథిగా హాజరై షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు.ఆమె రాకతో షాపింగ్ మాల్ పరిసరాలు అభిమానుల సందడితో కళకళలాడాయి.తమ అభిమాన నటిని చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు,అభిమానులు తరలిరావడంతో ప్రారంభోత్సవ ప్రాంగణం కోలాహలంగా మారింది. షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ వేడుకలో సంగీతం, నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా రితికా నాయక్ తన ఎనర్జిటిక్ డ్యాన్స్‌తో వేదికపై సందడి చేసి అభిమానులను అలరించారు.ఆమె నృత్య ప్రదర్శనకు అభిమానులు కేరింతలు, చప్పట్లతో ఉత్సాహం వ్యక్తం చేశారు. దీంతో చెన్నై షాపింగ్ మాల్ గ్రాండ్ ఓపెనింగ్ వేడుకకు రితికా నాయక్ ప్రధాన ఆకర్షణగా నిలిచారు. మున్సిపల్ కార్పొరేటర్లు యామా కవిత దయాకర్,కేసాను వేణుగోపాల్ రెడ్డి, షాపింగ్ మాల్ డైరెక్టర్ మర్రి వెంకటరెడ్డి,కృష్ణారావు మేనేజర్లు,సిబ్బంది ఉన్నారు.

## నేడు నల్లగొండలో ఐప్సో జిల్లా 4వ మహాసభ

**ప్రజాపక్షం/నల్లగొండ:** ప్రపంచ శాంతి కోసం ప్రజలంతా ఐక్యంగా గొంతెత్తి, యుద్ధాలను నిలిపివేసి శాంతిని నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఎఐపిఎస్ఓ ) నల్లగొండ జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి జిల్లా యాదయ్య పిలుపునిచ్చారు. ఎఐపిఎస్ఓ నల్లగొండ జిల్లా 4వ మహాసభ శనివారం నేడు నల్లగొండ పట్టణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, హింస, విధ్వంసం పెరుగుతున్న నేపథ్యంలో శాంతి ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లడమే మహాసభ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.యుద్ధాలకు స్వస్తి పలకాలి.. శాంతిని నెలకొల్పాలిప్రపంచ శాంతితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులు కావాలని వారు కోరారు. వాయు, జల, భూమి కాలుష్యం పెరుగుతుండటంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని తెలిపారు. యుద్ధాల వల్ల ప్రకృతి వనరులు నాశనమవుతున్నాయని, పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నారు. మానవాళి మనుగడకు శాంతి, పర్యావరణ పరిరక్షణ ఎంతో అవసరమని స్పష్టం చేశారు.ఈ మహాసభకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎల్.నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.





## ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** రాష్ట్రంలో పేద, మద్యతరగతి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు త్రిపురం అంజన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కాల్వ పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేసి మాట్లాడారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో పేదలసొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, లబ్ధిదారులకు పట్టాలు అందజేయడంతో వారు సంతోషంగా ఉన్నారని అన్నారు. మిగిలిన వారికి త్వరలో పట్టాలు అందజేస్తామన్నారు. ఉప సర్పంచ్ పొరల వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, గ్రామపెద్దలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బతుకమ్మ పండుగ ఏర్పాట్లు



**ప్రజాపక్షం/మునగాల:** నేటినుంచి ప్రారంభమయ్యే బతుకమ్మ సంబురాల నిర్వహణ కోసం గ్రామ సర్పంచ్ వేమూరి సత్యనారాయణ శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకొదండరామస్వామి వద్ద హైమాక్స్ లైటింగ్‌తో బతుకమ్మ వేడుకలు నిర్వహించేందుకు ప్రాంగణాన్ని శుభ్రం చేయించినట్లు తెలిపారు. దేవాలయం పక్కన ఉన్న కోనేరులో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు ఆ ప్రాంతలో కూడా శుభ్రం చేయించినట్లు తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## వైభవంగా అయ్యప్ప పల్లకి సేవ... కనకదుర్గమ్మ ఊరేగింపు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి శుక్రవారం అయ్యప్ప స్వామి పల్లకి సేవ, కనకదుర్గమ్మ అమ్మవారి ఊరేగింపును గురుస్వామి అరిగె శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ అయ్యప్ప స్వామి ఆశీస్సులు, కనకదుర్గమ్మ అమ్మవారి కృప ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యతను చాటుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మహితా రెడ్డి, పొదిళ్ళ ప్రదీప్ కుమార్, గొట్టిముక్కల శ్రీనివాస్ రెడ్డి, మిర్యాల సంపత్, గురుస్వామి పృధ్వి, ఇట్కూరి నాగరాజు, కొప్పెర నాగరాజు పాల్గొన్నారు.



## డాక్టర్ శ్రీనివాసచారికి టీచర్ ఎక్సలెన్స్ అవార్డు

**ప్రజాపక్షం/చండూరు:** చండూరు పట్టణానికి చెందిన ప్రముఖ విద్యావేత్త ,తెలుగు అధ్యాపకుడు డాక్టర్ ఇ.శ్రీనివాసచారి విద్యారంగంలో అందిస్తున్న విశిష్ట సేవలకు మరో ప్రతిష్టాత్మక గౌరవం అభించింది. విద్యార్థుల విద్యాభివృద్ధికి తెలుగు భాషా సాహిత్య బోధన, ఉపాధ్యాయ శిక్షణ , విద్యా సామాగ్రి రూపకల్పన ,బోధనా నైపుణ్యాల అభివృద్ధికి చేస్తున్నకృషిని గుర్తిస్తూ ఆయనను టీచర్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక చేశారు. శారద ఎడ్యుకేషన్ సొసైటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో డాక్టర్ ఇ. శ్రీనివాసచారికి 11 అక్టోబర్ 2026 రోజున హైదరాబాద్‌లోని లక్డికపూల్‌లోని పబ్లిక్ గార్డెన్స్ భగవాన్ అడిటోరియమ్‌లో ఈ ప్రతిష్టాత్మక పురష్కారాన్ని అందజేయనున్నారు. విద్యార్థుల్లో అభ్యసన సామార్థ్యాలను పెంపొందించడం ,ఉపాధ్యాయులకు మార్గదర్శకత్వం అందించడం ,తెలుగు బోధనను మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దడం వంటి కార్యక్రమాల్లో డాక్టర్ శ్రీనివాసచారి చేస్తున్న కృషికి ఈ అవార్డు గుర్తింపుగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు. చండూరు పట్టణానికి చెందిన విద్యావేత్తకు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మక పురష్కారం లభించడం పట్ల ఉపాధ్యాయులు ,సాహితీవేత్తలు ,విద్యాభిమానులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ శ్రీనివాసచారికి అబినందనలు తెలిపారు.

## వచ్చే యాసంగిలో వరిసాగుకు దూరంగా ఉండాలి



**ప్రజాపక్షం/చండూరు:** కపాస్ కాంతి పథకంలో భాగంగా అధిక సాంద్రత పత్తి సాగు విధానంపై శుక్రవారం బంగారిగడ్డ రైతు వేధికలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బంగారిగడ్డ సర్పంచ్ బోయపల్లి సునీత హాజరైయ్యారు. ఈ సందర్భంగా బంగారిగడ్డ వ్యవసాయ విస్తరణ అధికారి పవన్ మాట్లాడుతూ అధిక సాంద్రత ,దగ్గర దగ్గరగా విత్తే పత్తి సాగు చేయడం వల్ల పత్తి పంట ఒకేసారి చేతికి వస్తుందని అన్నారు. ఈ విధానంలో ఒక ఎకరానికి 40వేల మొక్కలు ఉండి సాధారణంగా సాగు చేసే పత్తి విధనం కంటే ఫ్రెండ్ మూడు రేట్లు ఎక్కువ మొక్కలు ఉండడం జరుగుతుందన్నారు. సర్పంచ్ సునీత మాట్లాడుతూ రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గు చూపడం మంచిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహహ్మద్ మహబూబ్ , ఏఎంసి డైరెక్టర్ తలారి నర్సింహ్మా, రైతులు పల్లె యాదయ్య , నకిరెకంటి యాదయ్య , సుంకరి సాయి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా నేరేడుచర్ల-జానలదిన్నె రోడ్డు మూలమలుపు



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** నేరేడుచర్లజానలదిన్నె రోడ్డు వెంట ఉన్న మూలమలుపు వద్ద ఏపుగా పెరిగిన కంప చెట్లతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇప్పటికే రోడ్డు వెంట ఉన్న గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడుతుంటే, మూలమలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు, పిచ్చి మొక్కల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ మార్గంలో నిత్యం ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు, ఇతర వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా రాత్రి వేళ్లలో మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించకపోవడంతో ప్రమాదాల భయం నెలకొంది. వాహనదారులు భయాందోళనతో అప్రమత్తంగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎక్కడ ప్రమాదాలు సంభవిస్తాయోనని రోడ్డు భద్రతపై వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈరోడ్డు వెంట పంట పొలాల్లో వ్యవసాయ పనుల కోసం రైతులు నిత్యం వస్తుంటారు. రైతుల సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే మూలమలుపు వద్ద రోడ్డు వెంట ఉన్న కంప చెట్లను, పిచ్చి మొక్కలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

## మూగజీవాలకు మేత, నీరు కరువుగా మారబోతుందా?

### వేసవి రాకముందే అప్రమత్తం కావాలి...గ్రామాల్లో నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలంలో మూగజీవాలకు మేత, నీరు సమస్యగా మారునున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. రానున్న వేసవిలో పశువులు, గొర్రెలు, మేకలు, పక్షులకు నీటి కష్టాలు మరింత పెరిగే అవకాశం ఉండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చందంపేట మండలంలో ఎక్కువ శాతం అటవీ ప్రాంతంతో కూడి ఉండడంతో వర్షాలు కురిస్తే తప్ప చాలా చోట్ల నీరు లభించడం లేదు. ఈ ఏడాది వ్యవసాయ పొలాల్లోనూ నీరు దొరికే పరిస్థితి అంతంత మాత్రమే ఉండడంతో మూగజీవులకు తాగు నీరు అందించడం సవాలుగా మారనుందని స్థానికులు చెబుతున్నారు. వేసవిలో నీటి కోసం మూగ జీవాలు ఇబ్బందులు పడకుండా ప్రతి గ్రామంలో నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామసర్పంచ్‌లు, సంబంధిత అధికారులు ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి సారించి, నీటి తొట్టెల్లో నిరంతరం నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వేసవి తీవ్రత పెరిగిన తర్వాత చర్యలు చేపట్టడం కంటే ముందుగానే ప్రణాళిక రూపొందించి మూగజీవాలకు నీటి సదుపాయం కల్పిస్తే వాటి దాహార్తిని తీర్చవచ్చని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.





## శ్రీనివాస్ కుటుంబానికి అండగా ఉంటాం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మాజీ వార్డు కౌన్సిలర్ చెంచల శ్రీనివాస్ కుటుంబానికి అండగా ఉంటామని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 20వ వార్డు కౌన్సిలర్ చెంచల మణిలత భర్త, పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ కౌన్సిలర్ చెంచల శ్రీనివాస్ ఇటీవల మరణించగా ఆయన గృహానికి వెళ్ళి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతిని తెలిపి రూ.50వేల ఆర్థిక సహాయం అందజేసి మాట్లాడారు. చెంచల శ్రీనివాస్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటన్నారు. భవిష్యత్తులో కూడా కుటుంబానికి అండగా పార్టీ తరపున అన్ని విధాలు ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్నతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మార్కెట్ కమిటీ పాలకవర్గం



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** వ్యవసాయ మార్కెట్ నూతన కమిటి పాలకవర్గం శుక్రవారం హైద్రాబాద్‌లోని రాష్ట్రమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటి చైర్మన్ రంగినేని స్పందన రాజీవ్, వైస్ చైర్మన్ మునగాల భాస్కర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటి అభివృద్ధి, రైతులకు మెరుగైన సేవలు అందించాలని, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ మార్కెట్ కమిటి పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ నూకల సందీప్‌రెడ్డి, చలసాని శ్రీనివాస్, మంజుల, చలసాని రాజీవ్, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు ఉన్నారు.

## ఈనెల 11 నుండి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లా కేంద్రంలోని శ్రీసంతోషి మాత దేవాలయంలో ఈనెల 11 ఆదివారం నుండి ఈనెల 20 మంగళవారం విజయదశమి వరకు దేవి శరన్నవరాత్రి ఉత్సవముల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు దేవాలయ అధ్యక్ష కార్యదర్శులు బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, పబ్బ ప్రకాశ రావులు తెలిపారు. శుక్రవారం దేవాలయంలోని ఆధ్యాత్మిక గ్రంథాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవముల కరపత్రాలను కమిటి సభ్యులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. నవరాత్రుల్లో అమ్మవారు రోజు కొక దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. 10 రోజులపాటు దేవాలయంలో కలశం ఏర్పాటు చేసి భవాని దీక్ష పూజలు కూడా నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్త మల్లికార్జున్, నరేంద్రుని విద్యాసాగర్, బెలిదె అశోక్, సోమ శ్రీశైలం, పాలవరపు రామమ్మూర్తి, తాళ్ళపల్లి రామయ్య పాల్గొన్నారు.





## స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** ప్రజాప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ గాయం త్రివేణి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కందిబండ గ్రామంలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి పదంలో నడిపించడమే నాధ్యేయమని అన్నారు. అర్హులపై పేదలను గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని అన్నారు.

## చెక్కు అందజేత



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** మండలంలోని బీమనపల్లి గ్రామానికి చెందిన మీసాల యాదయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.మృతుడు ఇన్సూరెన్స్ పాలసీ యాక్టివ్ నందున న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ సౌజన్యంతో మంజూరైన ఒక లక్ష రూపాయలు ప్రమాద బీమా చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం బీమనపల్లి గ్రామ సర్పంచ్ కర్నాటి వరలక్ష్మి పాండు చేతుల మీదుగా మీసాల మంజులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, గ్రామ వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మేనేజర్ రచ్చ శ్రీనివాస్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కర్నాటి వరలక్ష్మి పాండు పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ అందిస్తున్న సేవలను కొనియాడారు.

## విద్యుత్ కోతలపై ధర్నా




**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండల కేంద్రంలో శుక్రవారం విద్యుత్ కోతలపై బిఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షులు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు.ఈసందర్భంగా మాజీమార్కెట్ కమిటీ చైర్మన్ చిప్పలపెల్లి మహేంద్రనాద్, అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు ఉచితంగా 24 గంటల నాణ్యమైన కరెంటు ఇస్తే ,మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం కరెంటు కోతలు, లోవోల్టేజితో, రైతుల పంటలు ఎండుతుంటే పట్టించుకోకుండా ఉంది అని ప్రశ్నించారు. తదనంతరం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బిఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రానికి చెందిన అన్నెపర్తి యాదగిరి మృతిచెందడంతో విషయం తెలుసుకున్న మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ శుక్రవారం యాదగిరి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపి రూ. 5016లను ఆర్థిక సాయంగా అందజేశారు. ఈకార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు గణేష్, సంజీవ, భరత్ పాల్గొన్నారు.

## సామాజిక న్యాయ పోరాటానికి కాన్షీరామ్ స్ఫూర్తిప్రదాత



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సామాజిక పోరాటానికి కాన్షీరామ్ స్పూర్తి ప్రధాత అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, ప్రముఖ సామాజిక సంస్కర్త మాన్యవర్ కాన్షీరామ్ 20వ వర్ధంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలో ఆయన విగ్రహానికి ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. బహుజనుల హక్కుల సాధన, సామాజిక సమానత్వం, సమాజంలో వెనుకబడిన, అణగారిన వర్గాల సమగ్ర అభ్యున్నతి కోసం కాన్షీరామ్ తన జీవితాంతం చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. పేద వర్గాలకు రాజకీయ, సామాజిక ప్రాతినిధ్యం కల్పించడమే ధ్యేయంగా ఆయన సాగించిన పోరాటం దేశ చరిత్రలోనే చిరస్మరణీయంగా నిలిచిపోతుందని చెప్పారు. సమాజంలో సమానత్వం సాధించడంతో పాటు సామాజిక న్యాయం అందించేందుకు ఆయన చూపిన బాట ప్రతీ ఒక్కరికీ నిరంతరం స్ఫూర్తినిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, జిల్లా అధ్యక్షుడు బొప్పని నగేష్, సామాజికవేత్త, వైద్యుడు జాడి రాజు, కాంగ్రెస్ నాయకులు చిలుకూరి బాలకృష్ణ, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కోడిరెక్క మల్లయ్య, బీసీ సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ప్రతిభకు అండగా కవిత




**ప్రజాపక్షం/బీబీనగర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బి.సాయి కృష్ణ తయారుచేసిన పోర్టబుల్ కుకింగ్ స్టాండ్ ఫర్ కుక్ సేఫ్టీ అనే ఇన్నోవేటివ్ ప్రాజెక్ట్ ఢిల్లీలో జరగబోయే జాతీయస్థాయి సైన్స్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థి ఢిల్లీ వెళ్లడానికి కావాల్సిన డబ్బు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని స్థానిక టీఆర్ఎస్ పార్టీ నాయకులు బాషబోయిన బాలప్రసాద పార్టీ అధినేత దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత సదరు విద్యార్థి ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి ఖర్చు రూ.20,000 లను ఇస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం వారి ఆదేశానుసారం తెలంగాణ రక్షణ సేన నాయకులు బాషబోయిన బాలప్రసాద సదరు విద్యార్థి సాయి కృష్ణకు శుక్రవారం గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అందించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు గైడ్ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థి, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు ఉద్దేశ్యం ముఖ్యంగా దేశవ్యాప్తంగా పనిచేస్తున్న లక్షలాది మధ్యాహ్నం భోజన కార్మికులు పడుతున్న శ్రమకు పరిష్కారంగా తయారు చేయబడిందని ప్రాజెక్టు రూపకర్త తెలిపారు.

## విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాలు కృషి చేయాలనీ పరీక్షల కోసమే కాకుండా అప్లికేషన్ మెథడ్ లో విద్యాబోధన సాగాలని జిల్లా కామన్ బోర్డు పరీక్షల కార్యదర్శి పాండు సూచించారు. పోచంపల్లి మండలంలోని మోడల్ స్కూల్, జూలూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శుక్రవారం ఆయన ప్రభుత్వ పరీక్షల సహాయ కార్యదర్శి జై శ్రీనివాస్ తో కలిసి సందర్శించారు. జులూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న 9వ తరగతి హింది సమాధాన పత్రాల మూల్యాంకనాన్ని కూడా పరిశీలించి విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ఉత్తమ ఫలితాలు సాధనకు విలువైన అంశాలను చెప్పారు. మండల విద్యాధికారి పీ.ప్రభాకర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ నవీన్ కుమార్, ఉపాధ్యాయులు వారి వెంట ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/గుండాల;** ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని బిజెపి గుండాల మండల పార్టీ అధ్యక్షులు పింగళి విజయ్ భాస్కర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ధాన్యం కోతలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, బిజేవైఎం జిల్లా ఐటి సెల్ వివాకర్‌రెడ్డి, బిజేవైఎం సినియర్ నాయకులు సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతుసంఘం జాతీయ మహాసభలు జయప్రదం చేయాలి

**ప్రజాపక్షం/నిడమనూరు:** నవంబర్ 15 నుండి18 వరకు నాలుగు రోజులపాటు నల్గొండ ఎన్జీ కాలేజీ ప్రాంగణంలో జరగనున్న 36వ రైతు సంఘం అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను పార్టీ శ్రేణులకు జిల్లా రైతాంగానికి పిలుపునిచ్చారు, శుక్రవారం నిడమనూరు మండల కేంద్రంలో రైతు సంఘం మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులను భవిష్యత్ కార్యాచరణను ఈ మహాసభల్లో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యుడు కొమండ్ల గురువయ్య,ఇంజమూరు శివ,ముత్యాల కేశవులు పాల్గొన్నారు.



## ఉపసర్పంచ్‌లను మాత్రమే బాధ్యులుగా చూడడం సరికాదు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గ్రామ పంచాయతీల పరిధిలోని పాలనా సమస్యలు, చెక్ పవర్ అంశాలపై కేవలం ఉపసర్పంచ్‌లను మాత్రమే బాధ్యులుగా చేయడం ఎంతమాత్రం సరికాదని మిర్యాలగూడ మండల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు షేక్ అక్బర్ పాషా పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానికంగా మాట్లాడారు. ఉపసర్పంచ్‌ల చెక్ పవర్‌కు సంబంధించి పంచాయతీరాజ్ కమిషనర్ అక్టోబర్ 1, 2026న జారీ చేసిన మెమోపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు, ఉన్నతాధికారులు తీసుకున్న ఈ నిర్ణయం పూర్తిగా ఏకపక్షంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల పరిధిలో తలెత్తే వివిధ సమస్యలను, అభివృద్ధి పనులకు సంబంధించిన జాప్యాన్ని ఉపసర్పంచ్‌లకే ఆపాదించడం ఆమోదయోగ్యం కాదన్నారు. గ్రామ పాలన, పంచాయతీల పురోగతి అనేది సర్పంచులు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఉన్నతాధికారుల సమిష్టి బాధ్యత అని స్పష్టం చేశారు.

## నిరంతర విద్యుత్, సాగునీరు అందించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయానికి పగటి సమయంలో కనీసం 12 గంటల పాటు నిరంతరాయంగా, నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని తెలుగుదేశం పార్టీ నాయకుడు పోగుల సైదులుగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరిగి పంటలు ఎండిపోతున్న తరుణంలో రైతులకు అవసరమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని అవసరమైతే డెడ్ స్టోరేజీ నుంచి కూడా వినియోగించి నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని రైతుల పంటలను తక్షణమే రక్షించాలని కోరారు.విద్యుత్ శాఖ మంత్రి నియోజకవర్గమైన మధిరలో రైతులకు ఏ విధంగానైతే ఉచితంగా, నిరంతరాయంగా విద్యుత్ అందిస్తున్నారో అదే తీరుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ రంగానికి సమర్థవంతంగా కరెంట్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ వోల్టేజ్ సమస్యల కారణంగా విద్యుత్ సరఫరా తరచూ ట్రిప్ అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన దసరా సెలవుల్లో పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఏబీవీపీ టౌన్ జాయింట్ సెక్రటరీ వరుణ్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేపటి నుంచి ప్రారంభమయ్యే విజయదశమి సెలవుల్లో విద్యార్థులకు ఎలాంటి తరగతులు నిర్వహించకుండా విద్యాశాఖ అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలను అతిక్రమించి కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులను బడులకు రావాలని ఒత్తిడి చేయడం సరైన పద్ధతి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రకాల విద్యాసంస్థలు ప్రభుత్వ ఉత్తర్వులను తప్పనిసరిగా పాటించాల్సిందేనని స్పష్టం చేశారు.

## బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలోని నూనెగూడెం గ్రామంలో బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామంలో బతుకమ్మ నిర్వహించే ప్రాంగణంలో మట్టి పోయించి చదును చేయడం జరిగింది. మహిళలు బతుకమ్మను ఆడేందుకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసారపు యాదగిరిగౌడ్ సొంత ఖర్చుతో మట్టి పోయించి చదును చేయించడంతో గ్రామ ప్రజలు, మహిళలు, నాయకులు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దశరథగుప్త, వెంకన్న, సర్పంచ్ కొండమ్మ పరశురాములు, ఉప సర్పంచ్ ప్రశాంత్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



## కెజిబివి పాఠశాల ఆకస్మిక తనిఖీ

ప్రజాపక్షం/నాంపల్లి : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం నాంపల్లి తహసీల్దార్ అంబటి ఆంజనేయులు ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలోని స్టోర్ రూమ్, రికార్డులు,వంటగది పరిశీలించారు.తొమ్మిదో తరగతి విద్యార్థినులతో మాట్లాడి అందిస్తున్న సౌకర్యాలు, విద్యాబోధన గురించి అడిగి తెలుసుకున్నారు.పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని,విద్యార్థినులకు అవసరమైన సౌకర్యాల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ఆర్టీఐపై ప్రజలకు అవగాహన కల్పించాలి




ప్రజాపక్షం/చండూరు: ఆర్టీఐ( సమాచార హక్కు చట్టం) ద్వారా ప్రజలకు ప్రభుత్వ పాలనలో పారదర్శకత జవాబుదారితనం పెంపొందించేందుకు వీలుంటుందని ఆర్డీవో వందనపు శ్రీదేవి అన్నారు. సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్డీవో సూచించారు. 2026 సెలబ్రేషన్స్ వీక్ లో భాగంగా శుక్రవారం చండూరు ఎంపిడిఓ కార్యాలయం లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఆర్టీఐ అవేర్నెస్ ప్రోగ్రామ్ సమావేశంలో ఆర్డీవో శ్రీదేవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ శాఖల నుంచి సమాచారం పొందేందుకు సమాచార హక్కు చట్టం ప్రజలకు కల్పించిన అవకాశాలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ నాగమల్లేశ్వరరావు , ఎంపిడిఓ బందారు యాదగిరి , తహసీల్దార్ రమాకాంత్ శర్మ , అన్ని శాఖల డివిజన్ స్థాయి అధికారులు, పిఐఓ , ఏపిఐఓలు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



ప్రజాపక్షం/చందంపేట; నల్లొండ జిల్లా చందంపేట మండలం బుడ్డోనితండాకు చెందిన నేనావత్ దస్రునాయక్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు వద్య రమేష్‌నాయక్ పరామర్శించి, దస్రునాయక్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో రూ. 30వేల ఆర్థిక సాయం సర్పంచ్ మూడావత్ చిట్టి చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ మూడావత్ చిట్టి లాల్‌సింగ్, పరిపూర్ణచారి, చిన్నికుమార్, చత్రు, బాలు, శ్రీనివాస్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## గంధోత్సవ కార్యక్రమం

ప్రజాపక్షం/డిండి; హజ్రత్ షేక్ అబ్దుల్ ఖాదిర్ జీలానీ (గౌస్ ఏఆజమ్) గంధోత్సవం కార్యక్రమంలో శుక్రవారం బిఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వద్య రమేష్‌నాయక్ పాల్గొని దర్గా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్గా కార్యక్రమానికి విరాళంగా రమేష్‌నాయక్ రూ. 25వేలు అందజేశారు. రమేష్‌నాయక్ చేతుల మీదుగా ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం దర్గా కమిటి సభ్యులు రమేష్‌నాయక్‌ను శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు జైపాల్, పీర్ మహ్మద్, బషీద్, సతీష్, గోపాల్ పాల్గొన్నారు.

## చింతలపాలెంలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం



ప్రజాపక్షం/చింతలపాలెం : మండల కేంద్రంలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిని ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో వేపచెట్ల కొమ్మల మధ్య నుండి 11కెవి విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. గాలి వీచిన ప్రతిసారి కొమ్మలు తీగలకు తగిలి పెద్ద పెద్ద శబ్దాలతో కరెంటు సప్లై నిలిచిపోతుంది. ఎప్పుడు తీగ తెగి ఎవరి ప్రాణం పోతుందోనని గ్రామస్తులు భయంతో బతుకుతున్నారు. గత రెండు నెలల క్రితం ప్రజావాణిలో విద్యుత్ శాఖ ఏఈకు ఫిర్యాదు చేసిన ఆ సమస్యను పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై గ్రామ సర్పంచ్ కందుల రామకోటి రెడ్డి, ఉప సర్పంచ్ జంగాల అనంతమ్మ పుల్లయ్య గత కొన్ని నెలలుగా విద్యుత్ శాఖ ఏఈ, లైన్‌మెన్‌లకు ఎన్నిసార్లు ఫోన్‌చేసి, వినతిపత్రాలు ఇచ్చిన కనీసం వచ్చి చూడడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఏఈ సైదయ్యను వివరణ కోరగా చింతలపాలెం గ్రామంలో విద్యుత్ సిబ్బంది తక్కువగా ఉండడంతోపాటు రైతుల వ్యవసాయ బోర్లకు సంబంధించిన విద్యుత్ లైన్‌లో పనుల్లో బిజీగా ఉండడం, విద్యుత్ బిల్ మీటర్ రీడింగ్‌లు తీయడం వల్ల స్పందించడంలో కొంత జాప్యం జరుగుతుందని తెలిపారు. ఇకపై ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

## అప్పల కుప్పలతో ఆత్మహత్యే శరణ్యం



ప్రజాపక్షం/చింతలపాలెం : మండలంలోని పీక్లానాయక్ తండాకు చెందిన మహిళా రైతు లావుడియా రంగలి తీవ్ర ఆవేదనలో ఉన్నారు. తాను కౌలుకు తీసుకుని ఎంతో అప్పు చేసి వేసిన ఎకరం మిర్చి పంటనీళ్లు లేక పూర్తిగా ఎండిపోయింది. పులిచింతల ప్రాజెక్టులో నీళ్లు ఉన్నా తమ పొలాలకు ఎందుకు నీళ్లు ఇవ్వడం లేదని ఆ మహిళా రైతు అమాయకంగా ప్రశ్నిస్తూ కన్నీరుమున్నీరు అవుతోంది. కనీసం ఇంట్లో తాగే బోరు కూడా ప్రస్తుత ఎల్‌నినో ప్రభావానికి ఎండిపోయిందని, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా కనికరించడం లేదని వాపోయింది. అప్పుల కుప్పలతో ఆత్మహత్యే శరణ్యం అన్నట్లుగా ఆ మహిళా రైతు పడుతున్న వేదన అందరిని కలచివేస్తోంది. ఈ విషయం తెలుసుకున్న శివగంగ లిఫ్టు పర్యవేక్షణ కమిటీ వ్యవస్థాపకులు, మోర్తాల నాగిరెడ్డి వెంటనే స్పందించి పీక్లానాయక్ తండకు వెళ్లి ఆ మహిళా రైతును పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివగంగ లిఫ్టు ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రాజెక్టులో నీళ్లు ఉన్నా చివరి వరకు రావడం లేదన్నారు. శివగంగ లిఫ్టు పర్యవేక్షణ కమిటీ ద్వారా రైతుల గోస బయటపడుతోందని, రైతుల ఆర్తనాదాలకు ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.

## విధుల్లో నిర్లక్ష్యం వహించరాదు

### తిప్పర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో డిఎంహెచ్‌ఒ ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/తిప్పర్తి :మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నల్గొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రాహుల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఉదయం ఆసుపత్రికి చేరుకున్న ఆయన ముందుగా ఆసుపత్రి ఆవరణ,పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.అనంతరం సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని ఆదేశించారు. ఓపీ, ల్యాబ్, ఫార్మసీ, స్టోర్ రూం లను పరిశీలించి రికార్డుల నిర్వహణ, మందుల నిల్వలపై ఆరా తీశారు.ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య పథకాలను ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలని సూచించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ నగేష్,డాక్టర్ మమత,ఫార్మసిస్ట్ శ్రీనయ్య,పార్వతి తదితర ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## సత్యంకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఇవ్వాలి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : బీసీల హక్కుల కోసం సుదీర్ఘకాలంగా పోరాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు, బీసీ జేఏసీ రాష్ట్ర సమన్వయకర్త గుజ్జ సత్యంకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు.శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ ఉద్యమ నేత ఆర్.కృష్ణయ్య అడుగుజాడల్లో గుజ్జ సత్యం ఏళ్లగా బీసీల హక్కుల కోసం పోరాడుతున్నారని,జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం,స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, కులగణన, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల విడుదల,స్కాలర్ షిప్ లు,బీసీ కార్పొరేషన్ల బలోపేతం వంటి అంశాలపై నిరంతరం ఉద్యమిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి,బెస్త సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు,పెండెం ధనుంజయ,జిల్లా కోశాధికారి జేరిపోతుల రమేష్ గౌడ్,పట్టణ అధ్యక్షుడు పుట్టెంకన్న గౌడ్,వెంకన్న యాదవ్, మల్లెపోయిన సతీష్ యాదవ్,పగిళ్ల కృష్ణ,కస్తూరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సహాయం అభినందనీయం

ప్రజాపక్షం/మోతె : ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన జిల్లా పరిషత్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం చేసిన సాయం అభినందనీయమని జడ్పి సిఈఓ శిరీష అన్నారు. శుక్రవారం మండలంలోని విభళాపురం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన కొత్తపల్లి సుకన్య, ఆమె కుమార్తె అనారోగ్య, ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో ఆ కుటుంబానికి మినిస్టీరియల్ ఉద్యోగుల అసోసియేషన్ తరుపున సేకరించిన రూ.45వేల నగదుతోపాటు నిత్యవసర సరకులు, దుప్పట్లను అందించారు. ప్రభుత్వం నుండి కుటుంబానికి పెన్షన్‌తోపాటు ఉండడానికి ఇల్లు త్వరితగతిన వచ్చే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు పంతిని శ్రీధర్ నాయుడు మాట్లాడుతూ విధి నిర్వహణలోనే కాకుండా సమాజంలో ఆపదలో ఉన్న పేద కుటుంబాలను ఆదుకోవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుండ్ల చంద్రకళ, గౌరవ సలహాదారుడు నరేందర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు విజయ కుమారి, జిల్లా సహ అధ్యక్షుడు మునగాల శ్రీనివాసరావు, కోశాధికారి మణి కుమార్ పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శుల కమిటీ ఎన్నిక



ప్రజాపక్షం/మోతె : మండల పంచాయితీ కార్యదర్శుల నూతన కమిటిని ఎన్నుకున్నారు. మండలంలోని పంచాయితీ కార్యదర్శుల అధ్యక్షులుగా బోడపట్ల పూర్ణచందర్, ఉపాధ్యక్షులుగా పల్లెల రేణుక, గౌరవ అధ్యక్షులుగా తండు శ్రావణ్, జనరల్ సెక్రటరీగా చెవుల నాగరాజు, కోశాధికారిగా కొల్లు శ్వేత, మీడియా కోఆర్డినేటర్‌గా సిహెచ్ దేవేందర్, కమిటి సభ్యులుగా రాము, కవిత, సౌమ్య, సింధు, ఉపేందర్, మురళి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటి అధ్యక్షులు మాట్లాడుతూ మండలంలోని పంచాయితీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పనిచేస్తామని తెలిపారు. మండలంలోని పంచాయితీ కార్యదర్శులందరి సహకారంతో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ సాధించుకోవడం సూర్యాపేట ప్రజల బాధ్యత



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : బుల్లెట్ ట్రైన్ సాధించుకోవడం అనేది సూర్యాపేట ప్రజల హక్కుగా భావించి ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని పద్మశాలి సంఘం సీనియర్ నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్త అప్పం శ్రీనివాసరావు అన్నారు. బుల్లెట్ సాధన దీక్ష 57వ రోజు జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో దీక్షలో కూర్చొన్నారు. ఈ దీక్షలో సంఘం నాయకులు చల్లమల్ల నరసింహ, యేలె సత్యనారాయణ, దూలం నగేష్, యలగందుల సుదర్శన్, చిలువేరు నరసింహారావు, కడారి బిక్షం, పొన్నం వెంకన్న, భీమనపల్లి వెంకటేశ్వర్లు కూర్చొన్నారు.

## రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం



ప్రజా పక్షం/నకిరేకల్: మాస శివరాత్రి పురస్కరించుకొని నకిరేకల్ పట్టణంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో 141వ మాస కల్యాణోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. జిగురు లక్ష్మీనారాయణ శర్మ, వెంకన్న శర్మ ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఉప్పల రమేష్,ధర్మకర్తలు కొండ వెంకన్న గౌడ్,బొప్పని యాదగిరి,చెన్న చంద్రశేఖర్ నేత,కందాల ప్రవీణా రత్నారెడ్డి,మాజీ చైర్మన్ కొండ జానయ్య గౌడ్‌పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి క్రికెట్‌కు ఎంపిక

ప్రజాపక్షం/వేములపల్లి : తెలంగాణ మోడల్ స్కూల్ వేములపల్లిలో పదో తరగతి చదువుతున్న గుగులోతు పుష్పలత రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డి.సుజాత తెలిపారు.మంచిర్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో పుష్పలత ఎంపికైన సందర్భంగా ఆమెను అభినందించారు.పాఠశాలలో విద్యతో పాటుసెల్ఫ్ డిఫెన్స్,సంగీతం,క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

## స్మార్ట్ కార్డుల పంపిణీ

ప్రజాపక్షం/త్రిపురారం : అర్హులైన పేదలందరూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకుల కోసం స్మార్ట్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని త్రిపురారం సర్పంచ్ బైరం లక్ష్మి కృష్ణ అన్నారు.శుక్రవారం గ్రామ పంచాయతీ ఆవరణలో స్మార్ట్ కార్డులను ఆమె పంపిణీ చేశారు.అనంతరం మాట్లాడుతూ అర్హులైన పేదలకు రేషన్ కార్డులతో పాటు ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సలహాదారుడు అనుముల శ్రీనివాసరెడ్డి,ఉప సర్పంచ్ అనుముల నాగమణి పాపిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కోడిరెక్క రాజు,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినోపై అవగాహన సదస్సు



ప్రజాపక్షం/తుర్కపల్లి: తుర్కపల్లి మండలం తిరుమలాపురం గ్రామంలో రైతు నేస్తం, ఎఫ్‌పిఓ ఆర్గనైజేషన్ సంస్థల ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావం వల్ల రాబోవు కరువును ఎదుర్కొనేందుకు రైతులకు అవగాహన సదస్సు కల్పించారు. ఈ సందర్భంగా ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల రైతులు ప్రత్యామ్నాయ పంటలను వేయాలని, నీటిని పొదుపుగా వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ సముద్రాల వెంకటేష్, రైతు నేస్తం సంఘం అధ్యక్షులు చాడ కరుణాకర్ రెడ్డి, రైతు నేస్తం, ఎఫ్ పి ఓ సంఘాల వర్కర్స్, రైతులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలు సాగు

ప్రజాపక్షం/నేరేడుగొమ్ము: నల్గొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం యాసంగి సీజన్‌లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగు చేయకుండా ఆరుతడి పంటలు, కూరగాయలు, పప్పుధాన్యాల వైపు మొగ్గు చూపాలని వ్యవసాయ శాఖ దేవరకొండ సహాయ సంచాలకులు శ్రీ లక్ష్మీ సూచించారు. రైతులందరూ డిజిటల్ క్రాప్ సర్వేలో తమ పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని అన్నారు. శుక్రవారం నేరేడుగొమ్ములో పంట పొలాలను పరిశీలించి ఆమె మాట్లాడుతూ పంటల నమోదు ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో ఉత్పత్తులను మద్దతు ధరకు విక్రయించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ అధికారి యాదగిరి, ఏఈఓవెంకటేష్, రైతులు పాల్గొన్నారు.



## ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై మున్సిపల్ అధికారుల దాడులు



ప్రజాపక్షం/నలగొండ టౌన్ : నగర మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నెహ్రూ గంజ్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల విక్రయాలపై శుక్రవారం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించి,సుమారు 5 కిలోల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని 5వేల రూపాయల జరిమానా విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లను నిషేధించడం జరిగిందని అయినప్పటికీ వ్యాపారులు ఉపయోగిస్తున్నారని తెలిపారు. రిలయన్స్ దుకాణం ఎదుట నిర్మాణ సామగ్రిని నిల్వ ఉంచినందుకు సంబంధిత యజమాన్యానికి 2వేల జరిమానా విధించినట్లు అధికారులు పేర్కొన్నారు.నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదని, దుకాణాల ఎదుట నిర్మాణ సామగ్రిని ఉంచి ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించరాదని అధికారులు సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.పర్యావరణ పరిరక్షణ, పట్టణ పరిశుభ్రత కోసం ప్రజలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు దూరంగా ఉండి, ప్లాస్టిక్ కవర్లకు బదులుగా గుడ్డ సంచులను వినియోగించాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన నల్లగొండ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ జి.శ్రీనివాస్,వార్డు అధికారులు,పారిశుధ్య కార్మికులు,శానిటేషన్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## ఏదుల నుంచే నీరు ఇవ్వాలని కొవ్వొత్తుల ర్యాలీ



ప్రజాపక్షం/మునుగోడు : డిండి ఎత్తిపోతల పథకానికి ఏదుల (వీరాంజనే) జలాశయం నుంచే నీరు అందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మునుగోడులో డిండి జలసాధన సమితి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల కాలువతో సమానంగా డిండి కాలువను కూడా 436 అడుగుల ఎత్తులో నిర్మించాలని డిమాండ్ చేశారు. పాలమూరురంగారెడ్డికి ఏదుల నుంచి 436 అడుగుల ఎత్తులో నీరు తీసుకునేలా నిర్ణయించిన నేపథ్యంలో డిండికి కూడా అదే ఎత్తులో నీరివ్వాలని కోరారు. దశాబ్దాలుగా సాగు, తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న మునుగోడు,దేవరకొండ, నాగార్జునసాగర్ ప్రాంతాలకు డిండి పథకం కీలకమని, పథకం పూర్తయితే రైతులకు సాగునీరు,ప్రజలకు,పశువులకు నీటి లభ్యత మెరుగవుతుందన్నారు.ఈ నెల 14న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే పాలమూరురంగారెడ్డి, డిండి పథకాల సమీక్షలో నల్లగొండ జిల్లా నీటి అవసరాలపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో గురజ సునీల్,మారగోని అంజయ్య గౌడ్,పోలగోని సైదులు గౌడ్, మేకల శ్రీనివాస్ రెడ్డి,గజ్జల బాలరాజ్,ఐతగోని విజయ్,కంభంపాటి రాజేష్ పాల్గొన్నారు.

## ట్రెజరీ విధుల నుంచి పర్యాటక విశేషాల వరకు



ప్రజాపక్షం/నందికొండ: విధి నిర్వహణలో నైపుణ్యం సాధించడంతోపాటు చారిత్రక, ఆధ్యాత్మిక,సాంకేతిక విశేషాలను తెలుసుకునే దిశగా తెలంగాణ ట్రెజరీ అండ్ అకౌంట్స్ విభాగానికి చెందిన శిక్షణార్థి అధికారులు అడుగులు వేశారు.శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం,సాగర్ డ్యాం,ప్రధాన జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ జిల్లాలకు కేటాయించబడిన గ్రూప్3 ఎంపికైన 45 మంది సీనియర్, జూనియర్ అకౌంటెంట్లు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో 75 రోజులపాటు ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు.ఈకార్యక్రమంలో భాగంగా కోర్సు కోఆర్డినేటర్ రాధాకృష్ణారావు నేతృత్వంలో తొలుత నిడమనూరు సబ్ ట్రెజరీ కార్యాలయానికి వెళ్లారు.ప్రభుత్వ ఆర్థిక లావాదేవీలు,ట్రెజరీ కార్యకలాపాలు, అకౌంట్స్ నిర్వహణకు సంబంధించిన విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించి క్షేత్ర స్థాయి అనుభవాన్ని పొందారు.

## దశాబ్ది ఉత్సవంతో పదేళ్ల ప్రగతి ప్రస్థానాన్ని చాటిచెప్పాలి

**బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ విప్ గొంగిడి సునిత పిలుపు**




ప్రజాపక్షం/యాదాద్రి : యాదాద్రి భువనగిరి జిల్లా ఆవిర్భావానికి పదేళ్లు పూర్తయిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్లో తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఏర్పడిన జిల్లా పదేళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకొని, గతంలో సాధించిన అభివృద్ధిని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన పోరాట స్ఫూర్తిని చాటిచెబుతూ, జిల్లా అభివృద్ధిలో కీలక ఘట్టాలను ప్రజల ముందుంచాలని ఆయన సూచించారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత, మహిళలు, రైతులు, చేనేత కార్మికులు, విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఉత్సవాల్లో భాగస్వాములై విజయవంతం చేయాలని కంచర్ల రామకృష్ణారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునిత మహేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ఆంజనేయులు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ మండల అధ్యక్షులు జనగాం పాండు, ఏవి కిరణ్ కుమార్, జెక్క రాఘవేందర్ రెడ్డి, బల్గూరి మధుసూదన్ రెడ్డి,కంచి మల్లయ్య, చింతల సుదర్శన్ రెడ్డి, రాజేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని సందర్శించిన ట్రెజరీ,అకౌంట్స్ శిక్షణార్థులు

ప్రజాపక్షం/నిడమనూరు: హైదరాబాద్‌లోని డా.మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసిఆర్ హెచ్ఆర్డి)శిక్షణ విభాగానికి చెందిన రాధాకృష్ణారావు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న ట్రెజరీ అండ్ అకౌంట్స్ విభాగానికి చెందిన సీనియర్ అకౌంటెంట్లు మరియు జూనియర్ అకౌంటెంట్లు శుక్రవారం నిడమనూరు సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా సబ్ ట్రెజరీ కార్యాలయంలో నిర్వహించే రోజువారీ విధులు, బిల్లుల పరిశీలన, ఆన్‌లైన్ ఈబిల్ విధానం,ట్రెజరీ కార్యకలాపాలు మరియు కార్యాలయ నిర్వహణకు సంబంధించిన విధివిధానాలపై అవగాహన కల్పించారు. శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయిలో కార్యాలయ పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఈ సందర్శన ఎంతగానో ఉపయోగపడుతుందని శిక్షణ విభాగం నిర్వాహకుడు రాధాకృష్ణ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిడమనూరు సబ్ ట్రెజరీ అధికారి ఫణికుమార్, సీనియర్ అకౌంటెంట్లు వేణు,సరోజ,శ్రీకాంత్,కార్యాలయ సిబ్బంది పాల్గొని,శిక్షణార్థులకు కార్యాలయ విధివిధానాలపై అవసరమైన వివరాలను తెలియజేశారు.

## ప్రకృతి వ్యవసాయానికి మొగ్గు చూపాలి



ప్రజాపక్షం/మునుగోడు : మండల రైతులు పకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని మండల వ్యవసాయ అధికారి పద్మజ రైతులకు సూచించారు శుక్రవారం మండలంలోని జక్కల వారి గూడెం గ్రామంలో పకృతి వ్యవసాయం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు రైతులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.రైతులందరూ ద్రవ జీవామృతం, ఘనజీవామృతం,వేప కషాయం,పులిసిన మజ్జిగ వీటిని వాడుకుంటూ ఎరువులు, పురుగుమందులు, సిలింద్ర నాశకాల వాడకాన్ని తగ్గించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆగ్రామ సర్పంచ్ జక్కల రేవతి,మునుగోడు వ్యవసాయ విస్తరణ అధికారి జి మౌనిక,కృషి సఖి కొమ్ము మమత,వరికుప్పల శ్యామల,రైతులు కొమ్ము మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానికులకే ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలి

ప్రజాపక్షం/బీబీనగర్ : అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థలు స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సోషలిస్టు నాయకుడు బందారు శ్రీశైలం, మహమ్మద్ రఫీలు అన్నారు. శుక్రవారం తహసిల్దార్ శ్యాంసుందర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిమ్స్ ఆస్పత్రిలో రోజురోజుకు అవినీతిమయం ఎక్కువ అయిపోయిందని అవినీతి నివారించడంలో స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులు ఎవరు పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. అంతేకాకుండా స్థానికంగా ఐటిఐ 10వ తరగతి ఇంటర్ డిగ్రీ టెక్నికల్ నాన్ టెక్నికల్ స్థాయిలో ఉన్న స్థానిక నిరుద్యోగులకు ఎయిమ్స్ ఆస్పత్రిలో అవకాశం ఇవ్వడం లేదని ప్రైవేట్ కాంట్రాక్టర్ ఔట్సోర్సింగ్ ఉద్యోగాలను స్థానికులకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. వారి వెంట ఒగ్గు నాగరాజు పొట్ట మనోహర్, పంజాల సాయికిరణ్, సన్నీ గౌడ్, సురేష్, కట్ట లక్ష్మణ్, కట్ట కిషోర్, కట్ట అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబురాలు





**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఆదిత్య పాఠశాలలో బతుకమ్మ ఉత్సవాలను అత్యంత వైభవంగా, వినూత్నంగా నిర్వహించారు. శుక్రవారం పాఠశాల ఆవరణను శోభాయమానంగా అలంకరించి తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా వేడుకలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బంటు నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ కట్ట అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
పట్టణంలోని చైతన్య నగర్‌లో ఉన్న శిష్య పాఠశాలలో ముందస్తు బతుకమ్మ, దసరా సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వేడుకలలో పాఠశాల ప్రిన్సిపాల్ అల్లుబెల్లి శ్రీనివాస్ రెడ్డి, కరస్పాండెంట్ అల్లుబెల్లి శిరీష పాల్గొని మాట్లాడారు.
స్థానిక మిర్యాలగూడ పట్టణంలోని కేఎన్ఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 , ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. శుక్రవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన ఈ వేడుకలకు ప్రిన్సిపల్ భీమార్జున్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్స్, మహిళ సాధికారిక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ పండుగను విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఆట పాటలతో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సునంద, ప్రియాంక, బాలరాజు, నాగార్జున, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులో ఉన్న రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో దసరా వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ఫర్హీన్ సుల్తానా, ఉపాధ్యాయులు బాలయ్య, యశ్వంత్, శ్రీలత రెడ్డి, శైలజ, నాగమణి, నిఖిత, విజయలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణంలోని విజేత డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన సంబురాల్లో ప్రిన్సిపాల్ ధనుంజయ పాల్గొని మాట్లాడారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.



**ప్రజాపక్షం/నాంపల్లి** : మండల కేంద్రంలోని గాంధీజీ విద్యాసంస్థల్లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా చండూరు మున్సిపల్ చైర్మన్,ట్రస్మా జిల్లా అధ్యక్షులు,డాక్టర్ కోడి శ్రీనివాసులు గౌరీదేవికి పూలమాలలు వేసి పూజలు చేసి వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కర్నాటి నాగరాజు,సరికొండ వెంకన్న,ప్రిన్సిపాల్స్ సామల వెంకటేశ్వర్లు, చిలుకూరి రామేశ్వరి,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నకిరేకల్:** మండలంలోని పాలెంలో ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయులు ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకను కేవలం ఆనందానికే పరిమితం చేయకుండా,ప్రాథమిక అక్షరాస్యతసంఖ్యాజ్ఞానం విశిష్టతను తెలిపేలా సరికొత్తగా తీర్చిదిద్దారు.బతుకమ్మను పేర్చే ప్రతి పువ్వులో అందం, క్రమం ఉన్నట్లే..చిన్ననాటి నుంచే పిల్లలకు చదవడం,రాయడం,లెక్కలు నేర్పడం ఎంతో ముఖ్యమని తల్లిదండ్రులకు వివరించారు..ఈకార్యక్రమంలో హెచ్ఎం ఎల్. నగేష్,ఉపాధ్యాయులు టి.నర్సింహమూర్తి,జి.కల్పన, ఎస్. పద్మలత, విద్యార్థులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో శుక్రవారం కళాశాల సాంస్కృతిక శాఖ,మహిళా సాధికారత విభాగాల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు మంజుల, సునీత న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ రవికుమార్,ప్రొపసర్ అంతటి శ్రీనివాసులు,మునిస్వామి,నాగరాజు, శిరీష, అధ్యాపకులు డా.మల్లేశం, కోటయ్య.విద్యార్థులు పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/నిడమనూరు** : మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ సంబరాలను విద్యార్థినిలు ఘనంగా నిర్వహించారు.
**ప్రజాపక్షం/వేములపల్లి** : తెలంగాణకు తలమానికమైన బతుకమ్మ సంబరాలు చిన్నారులతో ప్రారంభమయ్యాయి. .కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కన్నెబోయిన వెంకన్న,ఉపాధ్యాయులు జ్యోతి, భవిత పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/వేములపల్లి** : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్లో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ప్రిన్సిపాల్ డి.సుజాత విద్యార్థులతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులు పేర్చిన బతుకమ్మలను తిలకించి,ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాటలీ చంద్ర,మీనాకుమారి,లక్ష్మి,షబానా,నైనా మునీషా బేగం తదితరులు పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/చండూరు:** సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని చండూరు మున్సిపాలిటీ చైర్మన్ , గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు , సన్‌షన్ పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న అన్నారు. శుక్రవారం గాంధీజీ , సన్‌షైన్ పాఠశాలలో ముందస్తూ బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ పాఠశాల డైరెక్టర్ సరికొండ వెంకన్న, సన్‌షైన్ పాఠశాల డైరెక్టర్ కోడి సుష్మా, ఉపాధ్యాయులు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/తుర్కపల్లి** :మండల కేంద్రంలోని పడాల ముత్యాలు మెమోరియల్ పాఠశాలలో ఎంగిలి పూల బతుకమ్మను సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలు, ఉపాధ్యాయురాలు బతుకమ్మ పాటలతో పాఠశాల ప్రాంగణంలో బతుకమ్మను ఆడారు. పాఠశాల కరెస్పాండెంట్ శ్రీ పడాల శ్రీనివాస్ బతుకమ్మను ఎత్తి అందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.
**ప్రజాపక్షం/కోదాడ:** తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయ పండుగైన ముందస్తు బతుకమ్మ వేడుకలను పాఠశా



లలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు అందుకున్న ఎండి సలీంషరిఫ్, బడుగుల సైదులు, యల్.దేవరాజు, శ్రీనివాసరెడ్డి, జానకిరాములు, చిన్నప్ప, ఇందిర, పాఠశాల ఉపాధ్యాయులు పాండురంగచారి, కె. రామకృష్ణ లను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు డి.మార్కేండేయ, డి.లింగయ్య, వీరబ్రహ్మాచారి, వేణుకుమార్, ఖాజామియా, శ్రీనివాసరావు, సిద్దిక్ పాల్గొన్నారు.





**ప్రజాపక్షం/అడ్డగూడూరు** : మండలంలోని పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా అడ్వాన్స్ బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. శనివారం నుండి పాఠశాలలకు సెలవులు కావడంతో శనివారం ఎంగిలి పూల బతుకమ్మ కనుక చివరి రోజున పాఠశాలలో ముందస్తుగా బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు.
**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో ముందస్తు దసరా బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.
**ప్రజాపక్షం/పెన్‌పహాడ్** ః తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పూల పండుగ బతుకమ్మ వేడుకలు మండల వ్యాప్తంగా ఉన్న పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి.



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి, వినోద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి,కళాశాలల ప్రిన్సిపాల్ లు,ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ రమణారెడ్డి,సిఓఈ ఉపేందర్ రెడ్డి తదితర అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.





## పొన్నగంటి కృష్ణయ్య జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం/డిండి; తవక్లాపూర్ గ్రామసర్పంచ్ పొన్నగంటి కృష్ణయ్య జన్మదిన వేడుకలను శుక్రవారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ ప్రజలు, యువకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా, ఆడబిడ్డల పెళ్లికి భరోసాగా, విద్యార్థుల భవిష్యత్తుకు ప్రోత్సాహకంగా పొన్నగంటి కృష్ణయ్య తన సేవా కార్యక్రమాలను కొనసాగించడం పట్ల అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం..



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీల అరెస్ట్ ను నిరసిస్తూ ఎన్ఎస్‌యుఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు యాదవల్లి వెంకటస్వామి పిలుపు మేరకు శుక్రవారం నల్లగొం డ జిల్లా అధ్యక్షుడు అల్లి అంజన్ యాదవ్ ఆధ్వర్యంలో అమిత్ షా,సిఈసి జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మ దహనం చేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అల్లి అంజన్ యాదవ్ మాట్లాడుతూ సర్ ఓటర్ల జాబితాపై శాంతియుత నిరసన చేస్తున్న రాహుల్ గాంధీ ని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని అమిత్ షా,జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సర్ లో పారదర్శకత ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బైరు ప్రసాద్ గౌడ్,జిల్లా నాయకులు సాయి తేజ,అనుముల పురి గొయల్,సూర్య,చిట్టీ బాబు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

ప్రజాపక్షం/కోదాడ: గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ప్రతి ఒక్కరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం ఓటు నమోదు చేసుకోవాలని కౌండిన్య గౌడ సంఘం ప్రతినిధులు కారింగుల శ్రీనివాసగౌడ్, మద్దికుంట్ల సైదులు పేర్కొన్నారు. శుక్రవారం కోదాడ పరిసర ప్రాంతాల్లోని విద్యాసంస్థలలోని ఉపాధ్యాయులను, నిరుద్యోగులను కలిసి స్వయంగా ఫారాలు నింపి ఆన్‌లైన్ కార్యక్రమం నిర్వహించారు. ఆ సంఘ జాతీయ అధ్యక్షులు కెఎల్ఎన్ ప్రసాద్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే తాము తమ సంఘ ఆధ్వర్యంలో హైద్రాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు సంబంధించి ఓటు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నమోదు కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, బత్తిని సాయి, బచ్చలకూర గురవయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## న్హెచ్ఎం ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ షాహిద్ అలీ ఏకగ్రీవ ఎన్నిక..



ప్రజాపక్షం/భువనగిరి : నేషనల్ హెల్త్ మిషన్ ( ఎన్‌హెచ్ఎం ) ఉద్యోగుల సంఘం (ఏఐటీయూసీ అనుబంధం) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ షాహిద్ అలీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే జిల్లా ఉపాధ్యక్షులుగా నెహ్రూ నాయక్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా సౌజన్య, సంయుక్త కార్యదర్శిగా వినోద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భువనగిరి పట్టణానికి చెందిన డాక్టర్ షాహిద్ అలీ ప్రస్తుతం భువనగిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జిజిహెచ్)లో ఫిజియోథెరపీ డాక్టర్గా విధులు నిర్వహిస్తున్నారు. ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను రెగ్యులరైసెషన్, సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా సంఘాన్ని బలోపేతం చేసేందుకు నూతన కమిటీ కృషి చేయనుంది. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షులు డాక్టర్ షాహిద్ అలీ మాట్లాడుతూ, ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు ఎలాంటి సమస్య ఎదురైనా తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని, అందరినీ కలుపుకొని ఐక్యంగా ముందుకు సాగుతానని, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. నూతన కమిటీ సభ్యులకు ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు, ఏఐటీయూసీ నాయకులు అభినందనలు తెలిపారు.

## గొర్రెలు, మేకల దొంగతనాలపై నిఘా పెంచాలి

ప్రజాపక్షం/బీబీనగర్ : గ్రామాల్లో గొర్రెలు, మేకల దొంగతనాలు పెంపకందారులను ఆందోళనకు గురిచేస్తున్నాయని, వాటి నివారణకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గొర్ల కాపర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండెబోయిన అయోధ్య యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సోము రమేష్ కురుమ కోరారు. శుక్రవారం బీబీనగర్ పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సీఐ సూర్య నాయక్‌ను కలిసి గొర్రెలు, మేకల రక్షణకు పోలీసుల సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు గొర్రెలు, మేకలను ఎత్తుకెళ్తూ పెంపకందారులకు ఆర్థిక నష్టం కలిగిస్తున్నారని వారు తెలిపారు. గొర్రెల పెంపకమే జీవనాధారంగా బతుకుతున్న కుటుంబాలు దొంగతనాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. పోలీసులు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ను ముమ్మరం చేయడంతోపాటు గొర్రెలు, మేకల మందలు ఉండే ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై దృష్టి సారించి, దొంగతనాలు జరగకుండా



ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మూగజీవాలను కాపాడటంతోపాటు పెంపకందారులకు భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చీర ఐలయ్య కురుమ, గుదె శ్రీశైలం కురుమ, నాయకులు అందె యాదగిరి కురుమ, ఎస్.కె.హుస్సేన్, పర్వతం శ్రీశైలం యాదవ్, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు గంజి శివకుమార్, కడెం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవకే జీవితం అంకితం...



ప్రజాపక్షం/డిండి; తన జీవితం ప్రజాసేవకే అంకితం అని రాజకీయాల్లో ప్రజా సేవ చేయడం ఓపిక ఉన్నంత వరకు కాదని, నాఊపిరి ఉన్నంత వరకు ప్రజలకు సేవ చేస్తానని తవక్లాపూర్ సర్పంచ్ పొన్నగంటి కృష్ణయ్య అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ తాను తన కుటుంబం సంతోషంగా ఉంటే చాలదని, ప్రజలంతా ఆనందంగా ఉండాలని ఆపదలో ఉన్న వారికి అండగా ఉండి కష్టాల్లో పాలుపంచుకున్నప్పుడే జన్మకు నిజమైన సార్థకము లభిస్తుందని అన్నారు. పుట్టిన గడ్డపై మమకారంతో గ్రామంతో, ప్రజలతో ఎప్పుడు విడదీయరాని బందంగా భావించి ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పనిచేస్తూ సొంత గ్రామంలో తాను తన సతీమణి చేస్తున్న సామాజిక సేవలకు గ్రామ ప్రజలందరూ జేజేలు పలుకుతూ రెండు పర్యాయాలు తనను, తన సతీమణి పొన్నగంటి అలివేలమ్మను గ్రామ సర్పంచ్‌లుగా గెలిపించి తవక్లాపూర్ ప్రజలు అక్కున చేర్చుకున్నారని . 2014 నుండి ప్రస్తుతం 2026 వరకు తవక్లాపూర్ గ్రామంలో ఎవరు చనిపోయినా కుల, మత, రాజు, బీద తేడా లేకుండా గ్రామంలో ఏ వ్యక్తి చనిపోయిన ఆ కుటుంబానికి రూ. 3వేలు తక్షణ సాయంగా అందజేస్తున్నామన్నారు. పొన్నగంటి కళ్యాణ కానుకగా గ్రామంలో సబ్బండ వర్గాల ప్రజలకోసం గ్రామంలో ఆడబిడ్డల పెళ్లి చేస్తే పెళ్లి కానుకగా రూ. 5116లను అందించే కార్యక్రమాన్ని సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేసిన రోజునే ప్రకటించినట్లు తెలిపారు. గ్రామంలో ఉన్నటువంటి ప్రాథమిక పాఠశాల, హైస్కూల్ విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంచడం కోసం తన తండ్రి జ్ఞాపకార్థం 2005 నుండి 10వ తరగతి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి స్థానంలో రూ. 5వేలు, రెండవ స్థానంలో రూ. 2500 ప్రతి సంవత్సరం అందిస్తున్నామన్నారు. తవక్లాపూర్ గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం ఇచ్చే నిధులతో పాటు తన స్వంత నిధులతో సైతం చేయాల్సిన పనులను చేస్తూ ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటున్నారని గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణం, మంచి నీటి సదుపాయం, పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం, వంట గదుల నిర్మాణం, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారంలో ముందుండి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడేందుకు పాటుపడుతున్నామన్నారు. తవక్లాపూర్ గ్రామ పంచాయతీని మండలంలో ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు కృష్ణయ్య తెలిపారు.



## ఫోన్‌పే కేటుగాడి మోసం 9వేల సిగరెట్ ప్యాకెట్లతో మాయం

ప్రజాపక్షం/గరిడేపల్లి: ఫోన్‌పే కేటుగాడి మోసం 9వేల సిగరెట్ ప్యాకెట్లతో మాయమైన సంఘటన శుక్రవారం మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. షాపు యాజమాని మేళ్లచెరువు చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కీతవారిగూడెం ప్రధాన రహదారిపై ఉన్న చంద్రశేఖర్ కిరాషాపు వద్దకు మద్యాహ్నం మూడున్నర గంటల సమయంలో ఇద్దరు గుర్తు తెలియని యువకులు వచ్చి ఖరీదైన సిగరెట్లు కావాని అడిగారు. కాగా షాపు యాజమాని భార్య మేళ్లచెరువు గౌతమి రూ.9వేల విలువగల సిగరెట్లను వారికి అందజేశారు. దీంతో వారు మా దగ్గర డబ్బులు లేవు. ఫోన్ ఫేలో చేస్తామంటూ చెప్పి ఫోన్ ఫే చేసినట్లు నమ్మించగా గౌతమి ఫోన్ ఫేలో రాలేదు అంటూ వారిని అడగటంతో మళ్లీ చేస్తానంటూ తీసుకుని ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. దీంతో లబోదిబోమంటూ షాపు యాజమాని గరిడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వారిని గాలించేందుకు సిసి కెమోరాలో ఫోటోలను పరిశీలిస్తున్నారు.

## డిండి ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

### మాజీ ఎంఎల్ఏ రవీంద్రకుమార్

ప్రజాపక్షం/డిండి; వారం రోజుల్లో నీళ్లు తెచ్చి ప్రతి ఎకరాకు నీళ్లిస్తానని చెప్పి పంటలు ఎండుతున్నా రైతులను పట్టించుకోని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ డిండి ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు క్షమాపణ చెప్పాలని దేవరకొండ మాజీ ఎంఎల్ఏ రమావత్ రవీంంద్రకుమార్ అన్నారు. శుక్రవారం కామేపల్లి గ్రామంలో ఎండిపోయిన రైతుల పంటలను పరిశీలించిన అనంతరం డిండిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంఎల్ఏ రవీంద్రకుమార్ మాట్లాడుతూ తీవ్రంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని అన్నారు. స్థానిక ఎంఎల్ఏ బాలునాయక్ ఇటీవల వారం రోజుల్లో నీళ్లు తెస్తానని చెప్పి ఇప్పటికి కేఎల్ఐ ద్వారా చుక్క నీరు తేలేదని అన్నారు. డిండి ప్రాజెక్టులో నీళ్లు పూర్తిగా అయిపోతున్న తరుణంలో రైతుల పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని రైతులకు ఎంఎల్ఏ బాలునాయక్ క్షమాపణ చెప్పాలని అన్నారు. డిండి ప్రాజెక్టు ఆయకట్టు రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా డిండి ప్రాజెక్టును రెండుసార్లు నింపిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనని, ప్రస్తుతం డిండి ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టు రైతులు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు చేతికొచ్చే కీలక సమయంలో నీరు అందక వరి పంటలు ఎండిపోతున్నాయని, రైతులు పెట్టిన పెట్టుబడులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని, రైతుల కష్టాలను గుర్తించి డిండి ప్రాజక్టు ను కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా వెంటనే నింపి, ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలు ఎండిపోయి నష్టపోతుంటే స్థానిక ఎంఎల్ఏ ఏం చేస్తున్నారని రవీంద్రకుమార్ ప్రశ్నించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ డిండి మండల అధ్యక్షులు రాజినేని వెంకటేశ్వర్‌రావు, పిఏసిఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రావు, సర్పంచ్‌లు విష్ణువర్ధన్‌రెడ్డి, రాములు, వెంకట్రామ్, వెంకటయ్య, శ్రీను, కొండల్‌రావు, శ్రీను, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

